కథా నిలయ
48910
శ్రీకాకుళం

# కాఫీ మానెయ్యడం

శంకరస్వామి ఒక్కబిగిని రెండుగంటలసేపు "కాఫీ దేశాన్ని ఎలా ధ్వంసం చేస్తోందో!" అనే విషయం ముచ్చటించగా, విన్నవాళ్ళలో ఒకణ్ణి అయిన నాలో కూడా కొంత ఉత్తేజం కలగక పోలేదు. ఆ మహాత్ములు కాఫీ మద్యపానంకంటె ఘోరమయిందని సెలవిచ్చారు. మద్యపాననిషేధం కంటె కాఫీని నిషేధించే చట్టం అత్యంతావసరమని ఆయన అభిప్రాయపడ్డారు.

నిజంగా కాఫీ దేశాన్ని ధ్వంసం చేస్తోందా? మద్యపానంకంటె ఘోరమయిందా, మధ్యతరగతి కుటుంబాలలోవున్న ఈ కాఫీ అలవాటు?

శంకరులవారి లెక్చరు వినేందుకు వెళ్ళేముందు అరకప్పు కాఫీ తాగాను. లెక్చరంతా పూర్తిగావిని దానిలోని అర్థం అవగాహన చేసుకొని, సారాంశం ఆమూలాగ్రంగా గ్రహించేందుకు యింకో అరకప్పుకాఫీ తాగాను. ఈ ప్రకారం ప్రతిదినమూ, అథవా అరడజను తఫాలయినా, ఈ ఆత్మారాముడు అరకప్పు కాఫీ చొప్పున కోరుతూ వుంటాడు.

బాగా ఆలోచించాను. మంచిచెడ్డలన్నీ ఆలోచించాను. ముందూ వెనకా ఆలోచించినా, ఎంత దూరం ఆలోచించినా, నిష్పక్షపాతమైన దృష్టితో చూస్తే, ఈ కాఫీ అలవాటు దురలవాటుగానే కనిపిస్తోంది.

సంసారం ఎంత వడుదుడుకుగా నడుస్తున్నా ఈ కాఫీ అలవాటు మానుకోలేనివారు ఎందరో వున్నారు.

క్రమము తప్పకుండా ప్రతిఉదయమూ సూర్యుడు ఎలా ఉదయిస్తున్నాడో, ఆమాదిరిగా వారిపొట్టలో కాఫీపడితే గాని యంత్రం పనిచెయ్యదు. "ఈ అలవాటు మీ తరంతో మాసిపోకుండా మీ పిల్లలకి కూడా మప్పుతున్నారే!" అంటే "పెద్దవాళ్ళు తాగుతూవుంటే కుర్రకుంకలు వూరుకుంటారా?" అంటారు.

నాకు ఊళ్ళోవాళ్ళ గొడవలన్నీ ఎందుకు లెండి! ఎవరిమనస్సులు వారికి అద్దాలు. ఆ అద్దాలలో ప్రపంచమంతా ప్రతిబింబిస్తూవుంటుంది. నన్నుగురించి నేను ఆలోచించుకుంటాను.

ప్రాతఃకాల అరుణ కిరణాలు మే మెంతో ఆప్యాయంగా పెంచిన గులాబీ చెట్టుని ముద్దెట్టుకునే వేళ శాంతాదేవి నా నోటికి కాఫీకప్పు అందిస్తుంది. మళ్ళీ ఎనిమిదిన్నరా తొమ్మిదింటికి తలవని తలంపుగా కాఫీ మీదికి ధ్యాసపోతుంది. కాఫీ కలిపి యివ్వమంటాను శాంతతో. 'వంటయిపోయింది' అంటుంది. 'కాఫీకావాలి' అనిపట్టుపడతాను. ఆమెవిసుక్కుంటూ, 'నెలకి నాలుగు వీశెలకాఫీ గింజలయినా యిద్దరికీసరిపోవు' అంటూ కాఫీ తయారు చేస్తుంది. పత్నీభాగం విషయంలో ఏమరుపాటు లేక రెండుగుక్కలు తనుగూడా నోట్లో పోసుకుంటుంది. మధ్యాహ్నం వొంటిగంటకి కాఫీ, మూడింటికికాఫీ, ఆఫీసులో పనిఅయిపోయిన తర్వాత యింటికివచ్చే ముందు కాఫీ, యింటికి వచ్చినతర్వాత భార్యారత్నంగారిచ్చే కాఫీ, మధ్యమధ్య స్నేహితులతో కాఫీ, తలకాయనొప్పి వస్తే 'అమృతాంజనం' బదులుకాఫీ, కథ వ్రాయాలంటే

inspiration కోసం కాఫీ, ఎక్కడో పెట్టి మర్చిపోయిన కాగి తాల కట్ట ఎక్కడవుందో జ్ఞాపకం చేసుకోనేందుకు కాఫీ! హరహర! అంతా కాఫీ. ఎక్కడచూచినా కాఫీ. 'ప్రపంచ మంతా ప్రేమమయం' అంటాడు మాఆచార్యవర్యుడు. 'ప్రపంచమంతా కాఫీమయం' అంటానునేను. ఏమూల చూచినా కాఫీహోటళ్ళే; ఎటుతిరిగినా కాఫీతాగుడుగాళ్లే! సెంట్రల్ స్టేషనుదగ్గిర స్టెతస్కోపు చేతులో పట్టుకొని వస్తున్న ఒకడాక్టరుగారినిఢీకొని, వులిక్కిపడి, 'I am sorry' అనే దాకా అలా ఆలోచిస్తూనే వున్నాను.

ఆ రాత్రి శాంతాదేవిఅంది. "మనం కాఫీ మానేద్దాం."

"భేష్!" అన్నాను.

"అంత త్వరగా వప్పుకొన్నారే? మీరు నిజంగా కాఫీ మానెయ్యగలరూ?"

"మానెయ్యగలను."

శంకరులవారి లెక్చరు మహిమ వల్ల నాలో కలిగిన ఆవేశం తెలీకపోవడంచేత నా జవాబులు ఆమెకి వింతగా కనిపించాయి.

శాంతని అడిగాను. "నీకు కాఫీ మానెయ్యాలని ఎందుకు బుద్ధిపుట్టింది?"

"ఈవిషయమై మనోరమ మాక్లబ్బులో యివ్వాళ సాయంత్రం లెక్చరిచ్చింది."

"ఏమని? కాఫీ మంచిదనా? చెడ్డదనా?"

"చెడ్డది. కాఫీ చాలా చెడ్డది. సంసారాన్ని పీల్చి పిప్పిచేస్తోంది. చిప్ప, కర్రా చేతికందిస్తోంది. ఆరో

గ్యాన్ని నశింపజేస్తోంది. ఆయువుని క్షీణింప జేస్తోంది. అంధులమైపోయి మన మందరమూ ఆ క్రూర రాక్షసికి బానిసలై పోతున్నాము."

"అయిపోయాం," అన్నాను.

నేనుకూడ ఆమె అభిప్రాయంతో ఏకీభవిస్తున్నందు వల్ల శాంతాదేవి పెదవులమీద చిరుహాసచంద్రికలు చిందులాడాయి. అజ్ఞానాంధకారంలో వున్న మా యిద్దరికీ వెలుగు చూపేందుకా అన్నట్లు భగవంతుడు మా యిద్దరి బుర్రలలోనూ ఈ ఉద్దేశాన్ని ఒక్కనాడే ఒకే కాలమందు నెలకొల్పాడు. లేకపోతే.........

"మనం కాఫీ మానేద్దాం," అంది శాంత.

"వో" అన్నాను, ఆంధ్రుడి ఆరంభశూరత్వంతో.

"రేపే ఈ రాక్షసిని మన యింట్లోనుంచి వెళ్ళగొట్టి, తలుపులు బంధించి, నీకు మా యింట్లో స్థలం లేదు సుమా—అని నిష్కర్షగా చెప్పేద్దాం."

"తప్పకుండా," అన్నాను. షష్టిచంద్రుడు మా యిద్దరి వంకా దొంగతనంగా చూస్తూ, దోబూచు లాడుతున్నట్లుగా మబ్బుల్లోకిపోయి దాక్కున్నాడు.

మర్నాటి ఉదయం కాఫీ మానేశాం. శాంతాదేవి త్వరగా వంట చేసింది. భోజనము అయేటంతవరకూ ఈ ప్రపంచమంతా నిర్జీవమైపోయినట్లూ, ఈ ప్రపంచంలోని కళా, సౌందర్యమూ అన్నీ నశించిపోయినట్లూ నాలో వార్థక్యం నా వయస్సుతోనూ యిష్టంతోనూ నిమిత్తంలేకుండా ప్రవేశించినట్లూ ఫీలయాను. బస్సు

ఎక్కుతున్నప్పుడు కడుపునిండా చల్దివణ్ణం తిని పొలానికి పోయే రైతు జ్ఞాపకం వచ్చాడు.

కాఫీ మానేశాననే విజయోత్సాహం నా ప్రతి రక్తనాళంలోనూ, విపరీతంగా గంతులేస్తోంది. కాఫీ మానెయ్య గలిగినానన్న ఆవేశపూరితమైన సంతోషం నా హృదయాన్ని ఆవరించుకు పోయింది. కాఫీ దాస్యశృంఖలాలని ఛేదించి స్వేచ్ఛావాయువుని పీల్చ గలుగుతున్నానన్న అహంకారం నాకు తెలీకుండానే నాలో ప్రవేశించింది. నా పక్కని కూచున్న ఈ బస్సు డ్రైవరు కాఫీకి బానిస. నా వెనక కూచున్న అయ్యంగారు కాఫీరాక్షసికి బంటు. 'ఫేర్' పుచ్చుకొన్న ఈ కండక్టరు కాఫీలేనిదే బతకలేడు. 'సైడ్' చూపిస్తున్న ఆ కానిస్టేబు కాఫీ లంచానికి కలవరిస్తూ వుంటాడు. వీరందరికంటె నేను మిన్న. వీరందరికంటె నేను గొప్పవాణ్ణి. నిన్నటిదాకా వీళ్ళలోనే వుండి, వీళ్ళందరి వలెనే సామాన్యుడిగా వుండి, ఇవ్వాళ, ఈ వుదయం, సప్తమి పూటా, అమాంతం, అంతరిక్షమార్గంలో వున్న ఒక ఉచ్ఛస్థానానికి ఎగరగలిగాను. మన సంఘంలో కబంధుడిలా వున్న కాఫీరాక్షసి చేతులు తెగనరికి బయట పడ్డాను.

రెండు గంటలయింది. ఆఫీసులో కూచుని ఏవో పేపర్లు చూసుకుంటున్నాను. అలవాటు ప్రకారం ఏమిటో జ్ఞాపకం వచ్చింది.

కాఫీ వేళయింది. కాని, కాఫీ మానేశాను. మధ్యాహ్నం కాఫీతో కూడా టిఫిన్ తినే అలవాటు వుంది.

భ్రష్టాకారి అయిన కాఫీతో టిఫిన్ కూడా మానేసి నట్లేనా? ఒక సమస్యే!

ప్రాతఃకాల సూర్యుడికి ఎదురుగా నుంచుని నేనూ శాంతా చేసుకున్న తీర్మానం స్మృతి పథంలోకి తెచ్చుకొన్నాను. "కాఫీ మావళ్ళూ, యిల్లూ గుల్లచేస్తోంది. అంచేత ఈ దిక్కుమాలిన కషాయాన్ని యికనుంచి తాగం. తాగం. తాగం. ముమ్మాటికీ తాగం." అదీ మా ప్రతిజ్ఞ.

ఆలోచించవలసిన విషయమే : నేను కాఫీ మానేస్తానన్నానుకాని కాఫీహోటల్‌కి వెళ్లడం మానేస్తానని అనలేదు. నవ్వకండి. నియమభంగం ఎప్పుడు వాటిల్లుతుందంటే కాఫీహోటల్‌కి వెళ్లి, కాఫీ తాగితే; నేను తాగనుకదూ! కాఫీ హోటల్‌లో కాఫీ కాక తదితరములైన తినుబండారాలు కూడా వుంటాయి గనక నేను ఆ తినుబండారాలు మాత్రమే తింటాను. నా ఆరోగ్యం కోసమూ, సంఘక్షేమం కోసమూ కాఫీని ధిక్కారంతోనూ, గర్వంతోనూ, ఈ కాఫీహోటల్ ప్రొప్రయిటర్లందరూ హడల్ ఎత్తేటట్లు త్యజిస్తాను. నా నియమానికి ఎంత మాత్రమూ లోపం కలగదు.

కాఫీ హోటల్‌లో సర్వరు రెండు వడలూ, ఒకదోసె యిచ్చిన తర్వాత, అతని అలవాటు చొప్పున ఒక కప్పు కాఫీ తీసుకువచ్చి టేబిల్ మీద వుంచాడు. నేనుకూడా - పొరపాటున - నా అలవాటుచొప్పున ఆ కాఫీ తాగెయ్యలేదు; కొంప మునిగిపొయ్యేది! నిష్కారణంగా నియమం నీటగలిసేది.

"కాఫీ ఎవరు తీసుకురమ్మన్నారు?" అన్నాను.

"మీకే, సార్."

"నాకు అక్కర్లేదు. కాఫీ మానేశాను." ఒక్క రక్తపుచుక్కయినా నష్టం లేకుండా జకోస్లోవేకియాని సంపాయించిన హిట్లర్ కూడా అంత అహంభావంతో మాట్లాడి వుండడు.

"మానేశారా సార్!" అన్నాడు. అంటూ చిన్న నవ్వు నవ్వాడు.

వెధవనవ్వు! విషపునవ్వు! కాఫీకి బానిస అయిన ఆ సర్వర్‌కి నేను ఆ రాక్షసిని జయించగలిగానని ఈర్ష్య!

"కూల్‌డ్రింక్ తీసుకురమ్మన్నారా, సార్?"

కాఫీకి బదులు కూల్‌డ్రింక్. నియమానికి ఎట్టి ఆపదా ఘటిల్లదు. తీసుకురమ్మన్నాను.

ఆ సాయంకాలమే వెంకట్రావు నన్ను మళ్లీ హోటల్‌కి ఈడ్చుకుపోయి నాచేత రెండు బోండాలు తినిపించి కాఫీ తాగమని బలవంతం చేశాడు. మానేశానని జంకుతూ చెప్పగానే అతను వెటకారంగా నవ్వాడు. ఆ హోటల్లో ఉన్నవారందరూ కాఫీతాగని ఈ కాఫీ హోటల్ పాట్రన్‌ని చూసి వెక్కిరిస్తున్నారా అనిపించింది. కొన్ని కారణాలవల్లకాని ప్రతిజ్ఞాపాలనలో అర్జునుడి తర్వాత అంతవాణ్ణని వాళ్లకేం తెలుసు?

"నువ్వు ఎంతకాలం మానెయ్యగలవు కాఫీ?" అన్నాడు వెంకట్రావు.

ఎంతకాలమేమిటి? మూర్తి నాకు వ్రాసి యిచ్చిన (వ్రాయించి యిచ్చింది కూడా కాదు!) ప్రామిసరీ నోటుకి కాలదోషం పట్టింది కాని మా నియమానికి

లిమిటేషనేమిటి! తెలివితేటలు ప్రకటించేటట్లు మాట్లాడాలనే కుతూహలంతో అన్నాను. "నేను ఈ నియమాన్ని ఉల్లంఘించే వేరొకనియమం చేసుకొనేవరకూ!"

వెంకట్రావు నవ్వాడు.

నియమాన్ని ఉల్లంఘించే నియమమేమిటి - నా తలకాయ! ఉల్లంఘింప బడనిదీ, ఉల్లంఘించేందుకు వీలు కానిదే కదూ నియమం అంటే! నోరు జారింది. ఆ నోరు జారడం వెంకట్రావుకి నవ్వుతాలుగా మారింది.

వెంకట్రావు సలహా యిచ్చాడు: "ఇలాటి వ్యర్థ ప్రయత్నాలు చేసి అనవసరమయిన మానసిక బాధ పడకు. సుఖాన్నివున్న ప్రాణం కష్టాన్ని పెట్టుకోవడం గాని, ఎట్టి ప్రయోజనమూలేదు. రోజూ అరడజను సార్లు కాఫీ తాగే అలవాటుని ఒక్క రోజులో ఒక పిచ్చినియమంతో అరికట్టగలవా? అసాధ్యం. నీకు కాఫీ మానెయ్యాలనే ఉద్దేశం కలగడం చాలా ప్రసంశనీయమైన విషయం. కాని, నువ్వాపనిని నియమాలవల్ల చెయ్యలేవు. నెమ్మది-నెమ్మదిగా చెయ్యాలి. ఇప్పుడు నువ్వు రోజూ ఆరు సార్లు తాగుతున్నావా — ఆ అలవాటు నాలుగుకి తగ్గించాలి. అలాకొంతకాలం గడిచిన తర్వాత రోజుకి రెండు లేక మూడుసార్లు తాగాలి. అలా మరి కొంతకాలం గడిచిన తర్వాత రోజు విడిచి రోజు, మూడు రోజులకో తూరి, వారానికో తఫా, తర్వాత పండగ రోజులలోనూ, యింక ఆ పైన నెలకి ఒకే ఒక్కసారి. అది ప్రతినెలా ఒకటో తేదీన...జీతం పుచ్చుకోగానే! ఇలాగ ఆ అలవాటుతో వుండే శక్తిని జాగర్తగా తగ్గించు

కుంటూ రావాలి. ఈ మాదిరి ప్రయత్నించేస్తే నువ్వు మూడు సంవత్సరాలలో, కాఫీ మానెయ్యగలుగుతావు, అంతేగాని - అమాంతం అలవాటు తప్పించుకోలేవు. ఆఫ్రికాలోని నీగ్రోని ఉత్తరధ్రువం దగ్గిర పారేస్తే చచ్చి పూరుకుంటాడు. భూమధ్యరేఖ దగ్గిర వున్నవాణ్ణి నెమ్మది నెమ్మదిగా సమశీతోష్ణ ప్రదేశాలకి తీసుకురావాలి. ఆసమశీతోష్ణాలలో కొంతకాలం వుంచి నెమ్మదినెమ్మదిగా ధ్రువం దగ్గిరికి తీసుకుపోవాలి. మనం ప్రతిపనీ లెఖ్ఖ ప్రకారం చెయ్యాలి."

వెంకట్రావుది బి. ఎ. లో కూడా. లెక్కలు. నావి హిస్టరీస్. నేనెంతకీ చచ్చినవాళ్ళ పేర్లూ, వారి నడతలూ చదివాను. అతను ప్రతివిషయమూ Calculative గా చూడడం నేర్చుకోగలిగాడు.

ప్రతిజ్ఞలో ఏదో కొంత తొందర పడ్డానని మొట్ట మొదటిసారి నాకు స్ఫురించింది కాని, తీర్మానించుకొన్న తర్వాత తిరగడం సాధ్యమా? వెంకట్రావు నన్ను చూసి జాలిపడుతున్నట్లుగా నా వీపు చరిచాడు.

రాత్రి శాంతాదేవితో వెంకట్రావు అభిప్రాయాలు చెప్పాను. వెంకట్రావు పల్కులలో కొంత సత్యం వుందని నేను సమ్మాను కాని శాంతాదేవి ఎంత మాత్రమూ నమ్మలేకపోయింది.

"మూడు సంవత్సరాలుకాదు; ముప్ఫయి సంవత్సరాలు గడిచినా మనం ఆ పద్ధతి ప్రకారం కృతకృత్యులం కాలేం!"

"ఏం?" అన్నాను.

"ఇలాటి చెడ్డ అలవాటుని పట్టుదలవల్ల కట్టి వెయ్యాలి కాని నెమ్మదినెమ్మదిగా మానెయ్యడం సాధ్యం కాదు."

"కాని వెంకట్రావు కూడా పొరబడ్డలేదేమో!"

"వెంకట్రావో, గింకట్రావో నాకు తెలియదు. ఆయనది శుద్ధ పొరపాటు. కాఫీపిశాచాన్ని జయించ లేక దానికి వంగి వంగి సలాములుచేసే పెద్దమనిషిలా వున్నాడు."

"ఆయనకి కాఫీ అలవాటులేదు. నలుగురితో పాటు అప్పుడప్పుడు తాగుతాడు. అంతే!"

"మీరింత దుర్బల హృదయులేమిటి?"

"ఏం?"

"మంచికో, చెడ్డకో-ఒక నియమం చేసుకొన్నామా-ఆ నియమాన్ని ఉల్లంఘిస్తారా?"

"ఊహుఁ" అన్నాను, శంకరులవారు సంఘక్షేమం కోసంచెప్పిన ఉపన్యాసం జ్ఞప్తికి తెచ్చుకుంటూ.

"పుర్రెకోకబుద్ధి అన్నట్లు మనుషులురకరకాలుగా మాట్లాడుతూ వుంటారు. మన కేం? మనంమాత్రం ఆకాఫీ పిశాచాన్ని యింట్లో అడుగుపెట్టనివ్వవద్దు."

శాంత ప్రతిజ్ఞాపాలనలో ఘట్టిగావుంది.

ఇంకాఏదో మాట్లాడుదామనీ, వాదిద్దామనీమన స్సులో వుబలాటంగా వున్నా, శాంతాదేవికికోపం వస్తుం దేమో నని నిశ్శబ్దదేవత కౌగిలిలో యిమిడిపోయాను.

వారంరోజులు గడిచాయి. కాని, పొగళ్ళు వేసవి కాలంలోవి లాగూనూ, రాత్రులు శీతాకాలంలోవి లాగూనూఉండేవి. పొగటివేళ సూర్యుడుఒంటెనడక నడిచే వాడు. ఎంతకీప్రొద్దు గూకేదేకాదు. ఈవైపరీత్యం కాలంలోనే వుందనేటంత అవివేకం నాలోలేకపోవడం చేత నా మనస్సులోనే వుందని నిశ్చయించుకొని, దానికి కారణం "కాఫీరాక్షసి చేస్తున్నహంగామా' అని తెలుసుకోగలిగాను. అసిధారా వ్రతచర్య ఏడురోజులు ఆచరించిన తర్వాత శాంతతో అన్నాను.

"మనం రేపట్నుంచి రోజూ ఉదయంవేళ వోవల్‌టిన్ తాగుతూవుంటే పుష్టికరంగానూ ఆరోగ్యకరంగానూ వుంటుందేమో!"

"వద్దు. వద్దు. లోబడిపోకండి. మూడు నెలల దాకా మనం ఎట్టిపానీయమూ సేవించవద్దు," అందిశాంత, ఆడదానికి ఉండవలసినంత పట్టుదలతో.

కాలనిర్ణయం లేదనుకొన్న మా నియమాన్ని శాంత అప్రయత్నంగా ఒక కట్టుబాటులోకి తీసుకు వచ్చింది. టైమ్‌లిమిట్ ఏర్పాటుచేసింది. అంటే మూడు నెలల తదనంతరం కాఫీమళ్ళీ ప్రారంభించాలని ఆమెఉద్దేశం కాదు; కాఫీస్థానే మరొక ఆరోగ్యకరమైన పానీయం సేవించ వచ్చునని ఆమె అభిప్రాయం.

కాఫీమీద నాకు వున్నంతభ్రమ ఆమెకివున్నట్లుగా తోచడంలేదు. బహుశా వెంకట్రావు చెప్పిన విషయం కూడా కొంతవరకూ నిజమేనేమో! నేను రోజూ ఆరుసార్లు

తాగేవాణ్ని. ఆమె దినానికి రెండుసార్లతో సరిపుచ్చు కొనేది. అంచేతనే యేమో మా యిద్దరిలోనూ ఈ తేడా!

ఎన్నో సాధారణఅసాధారణ విషయాల ఫలితంగా మరుసటివారంలో శాంతనిఅడిగాను,"నాకు రోజూ ఉదయం వేన్నీళ్ళలో కాస్త పంచదారవేసి యిస్తూవుండు. అది తాగుతాను"

నా నిజాయితీకి ఆమె జాలిపడి నా ప్రార్థనని తోసిపుచ్చలేక పోయింది. కాని, తను మాత్రం అలాటి నీచానికి పాల్పడనంది.

ఇరవై రోజులు గడిచేటప్పటికి మా ప్రవర్తనలో పెద్ద పరివర్తన కలిగింది. మాకు తెలీకుండానే ఒకర్నొకరం ద్వేషించుకోవడమూ, అసహ్యించుకోవడమూ ప్రారంభించాం. అంతర్యంలో యిద్దరికీ తెలుసు - ఈ మానసిక ప్రళయానికి కారణం కాఫీ విమోచనని!

ఒక సాయంత్రం నిద్ర మొహంతో ఆఫీసునుంచి వచ్చేటప్పటికి శాంత తనకి తలనొప్పిగా వుందంది. ఆ రాత్రికి ఉడుకుగా మారింది; మర్నాటి ఉదయానికి జ్వరమయింది; మధ్యాహ్నానికి థర్మామీటర్ కోరింది; సాయంకాలానికి డాక్టర్ని హాజరు పెట్టమంది.

మిత్రుడూ డాక్టరూ అయిన శంకర్ శాంతాదేవి నాడీ, గుండెలూ, నాలికా పరీక్షించి, ఒకపొట్లం యిచ్చి, ఆ మందు నోట్లో వేసుకొని ఒక గ్లాసెడు కాఫీ తాగితే తెల్లవారేటప్పటికి జ్వరం సర్దుకుంటుందన్నాడు.

నేను మా నియమం సంగతి డాక్టర్‌కి చెప్పడానికి తటపటాయిస్తున్నాను.

"కాఫీ నేను తాగనండీ. కాఫీ దేహారోగ్యాన్ని పాడుచేస్తోందని మానేశాం," అంటూ శాంత ఆమెకి కాఫీ అంటే వున్న అభిప్రాయమూ, ప్రతిజ్ఞ విషయమూ పూసగుచ్చినట్లు డాక్టరుతో చెప్పింది. నేను రోజూ ఆరుతఫాలు తాగడం, ఆమె రెండుమూడు సార్లు తాగడం విని, గవ్వలు గలగల పోసినట్లు డాక్టర్ శంకర్ నవ్వాడు. "ఎవరు చెప్పారు మీకు కాఫీ అనారోగ్యకరమయినదని?"

నేనూ శాంతా ఒకర్నొకరం చూసుకొన్నాం. ఎవరు చెప్పారు మాకు? నాకు శంకరులవారు చెప్పారు; ఆమెకి మనోరమ చెప్పింది.

"కాఫీ మితిగా తాగడం మంచిది, అతిగా తాగడం జబ్బు," అన్నాడు డాక్టర్.

"మితి అంటే?" అన్నాను నేను.

"ఉదయం ఒకకప్పు కాఫీ, మధ్యాహ్నం ఒక కప్పు కాఫీ."

"కాఫీ ఒక stimulant కాదండీ?"

"అవును, మీరిద్దరూ ఆ stimulant కి అలవాటు పడ్డారు. అంత త్వరగా ఆ అలవాటునుంచి విముక్తులు కాలేరు. అలవాటుని బహు జాగ్రత్తగా తప్పించుకోవాలి"

వెంకట్రావు చెప్పిన ఫక్కీలోనే డాక్టరు కూడా మాట్లాడాడు. "రోజూ ఆరుమార్లు తాగేవారు ఒక్క శుష్కనియమంతో అలవాటునరికట్టగలరా?" అంటూ నావంక చూచి ఎగతాళి చేశాడు. శాంతాదేవి నన్ను

దబాయించగలిగింది కాని ఆరోగ్య విషయంలో అథారిటీ అయిన డాక్టర్‌ని ఎలా బుకాయించగలదు?

డాక్టర్ శంకర్ ఈ కబుర్లూ ఆ కబుర్లూ చెపుతూ అమెరికన్ డాక్టర్లు కాఫీ గురించి వక్కాణించిన వాక్యాలు వినిపిస్తూ, నా చేత కాఫీ కాపించాడు. ఆమె మందు పొట్లం నోట్లో వేసుకొని, కాఫీ కూడా మందుగా భావిస్తూ, ఒక గ్లాస్ కాళీ చేసింది. అతిథిసత్కారంగా డాక్టర్‌కి కాఫీ యిచ్చాను. నియమానికి భంగం ఎలాగా వాటిల్లింది కదా, మొట్టమొదట్నుంచీ నేనీవిషయంలో కొద్దిగా చప్పచప్పగానే వుంటున్నానుకదా అనుకుంటూ కాఫీఅమృతాన్ని నోట్లో పోసుకొన్నాను.

డాక్టర్ వెళ్ళిపోయాడు.

ఉపన్యాసాలు విన్న ఉద్రేకంలో వివేకజ్ఞానం లేకుండా నియమాలు చేసుకొని, అవి గాలిలోని ఎండుటాకులు మాదిరిగా పరిణమించాయని విచారించకూడదని నాకూ శాంతకీ మొట్టమొదటసారి తెలిసింది. ఆ యిరవై రోజులూ మేమెంత ఫూల్సు మయిపోయాం! నాటినుంచీ నేటివరకూ కాఫీ మానెయ్యాలనే ప్రయత్నాలు మేము చెయ్యడం లేదు.

రచన : ఏప్రిల్ 39 – ముద్రణ : 'భారతి' సెప్టెంబరు 39